# కథ

# గుర్తుకొస్తున్నాయ్

యు.వి. రత్నం

తెల్లవారు ఝామున్నే నాలుగు గంటలకు లేచి పాలబూత్‌లో పాలపేకెట్లు తీసుకుని వెళ్ళి ఇంట్లో పడేసి, రంగారాయుడి చెర్వుగట్టుమీది రెండురౌండ్లు వాకింగ్ చేసి యింటి దార్ని వస్తుంటే, ఎక్కడనించి వస్తున్నాడో రామచంద్రం మనవడు జ్ఞానప్రకాశం నన్ను చూసి స్కూటర్ షడన్ బ్రేక్ వేసి, 'మాష్టారు మీఫ్రెండ్ రాఘవయ్యగారు రాత్రి పోయార్ట' అని రివ్వున వెళ్ళిపోయాడు, 'రాత్రి రెండుసార్లు బ్లడ్ వామింట్స్ అయాయిట అంటూ' 'కాసేపటి వరకు స్టన్ అయిపోయా' ప్రక్కన ఏం జరుగుతున్నది తెలియ రాలేదు. గొంతు ఎవరో నులివేసినట్లు, మాట ఆగిపోయినట్లు అనిపించింది. సుగర్ డవున్ అయినట్లు వళ్లంతా వణుకు, వెన్నులో చలి పుట్టినట్లయింది. 'అయ్యో రాఘవుడు పోయాడా!' అప్రయత్నంగానే అన్నట్లు అనిపించింది. గభాగభా ఇంటికి వెళ్ళి ఓ కప్పులో అరస్పూన్ చక్కెర వేసుకుని రెండు సిప్స్ చేసేంతరువాతగాని వళ్ళు స్థిమిత పడలేదు. ఓ అరగంట తరువాత మనస్సుకు కాస్త తెరిపి యిచ్చింది శరీరం.

రాఘవుడు నాకంటే నాలుగేండ్లు చిన్న. నేను ఫిఫ్త్‌ఫాంలో వున్నపుడు వాడు థర్డ్‌ఫారంలో వుండేవాడు. రెండో సంవత్సరం తరువాత కాబోలు డబల్ ప్రమోషన్ అయి 3వఫారం నుంచి ఫిఫ్త్‌ఫారంలోకి వచ్చేడు. నేను చేస్తు పెట్టేసరికి నాతో కలిసి నా బెంచ్‌మేట్ అయాడు రాఘవుడు. వాడ్ని ఎపుడు పిలిచినా 'రాఘవా' అంటే పలికేవాడు. వాడికి తెలియని సబ్జెక్టులేదు, కథలు చెప్పేవాడు జాతక చక్రం వేయటం. ప్రిడిక్షను చెప్పటం, చేతులు చూసి రేఖలు చేతుల్లో జీవితాన్ని ఎన్ని మలుపులు తిప్పుతామో చెప్పేవాడు. వాడివల్లే పరాశర సంహిత, కేరియోస్‌పామిస్ట్రీ నాకు కాస్త వంటపట్టింది. సంఖ్యాశాస్త్రం అన్జెప్పి ఒక అక్షరం ఇంగ్లీషు అల్ఫ్‌బెట్ నా పేరుకు చేర్చి నువ్వు నెంబర్ సిక్స్ పీపుల్ అవుతావు. నీలైఫ్‌కి ఏం ఢోకాలేదని చెప్పింది రాఘవుడే. చాల టిపికల్ మనిషి. అదేంటో విచిత్రం వాడినోటితో ఏది అంటే అది జరిగేది చిత్రంగా. పియుసిలో బైపి గ్రూపు తీసుకున్న నేను, గ్రాడ్యుయేషన్‌లో బికాం చేసి బ్యాంకులో ఆఫీసరుగా జాయిన్ అయాను. డాక్టరు నవుదామనుకున్న కోరిక కలగా మిగిలిపోయింది. రాఘవుడు బియస్సితో చదువు ఆపి కోర్టులో రికార్డు అసిస్టెంట్‌గా జాయిన్ అయాడు. వాండ్ల నాన్న పోరు పడక. కుటుంబం పెద్దది కావడంతో, మధ్యలో వాండ్ల నాన్న చనిపోవటం, తమ్ముళ్ళ చదువులు, చెల్లెలు పెండ్లి, వాడికి భారం అవటం మూలాన ఉద్యోగం, బాధ్యతలు తప్పలేదు. 'బహుశ సగటు మనుషుల జీవితాల తీరు అంతేనేమో!' అనిపిస్తుంది. కాస్త అటూ, ఇటూగా....

ఆర్.ఆర్.బి. బ్యాంకు రిక్రూట్‌మెంట్ ఫస్ట్‌బేచ్‌లో సెలక్టయి ఒరిస్సాలో భువనేశ్వర్‌లో జాయిన్ అయి మరలా ఆంధ్రాకు ట్రాన్స్‌ఫర్ అయి వచ్చిందాకా రాఘవుడ్ని కలవటం కుదరలేదు. మధ్యలో ఒక్క సారి కాబోలు, ఓ ఆదివారం శెలవ రోజు, అయినా బ్యాంకులో బ్యాలెన్సింగ్ వర్క్ చేసుకుంటూ వుండగా హఠాత్తుగా వచ్చేడు రాఘవుడు.

'ఒరేయ్ రాజా' నన్ను రాజా అనే పిలిచేవాడు రాఘవుడు ఆప్యాయంగా. 'కోణార్క్' వెళుతున్నాను. నువ్వు కూడా రమ్మని హడావిడీ చేసేడు, నువ్వు రాకుంటే యింత దూరం వచ్చిన వాణ్ణి కోణార్క్ చూడకుండా చేసిన పాపం నీదేనంటూ బతిమాలాడాడు. ఆ రోజు మాబ్యాంకు క్వార్టర్లీ క్లోజింగ్ ఆఫ్ ఎకౌంట్స్. ఎలాగో మేనేజరు గార్కి చెప్పి, ఆ సాయంకాలానికి, డేబుక్, పిడియల్, (లాభనష్టాల ఖాతా) బ్యాలెన్స్ చేసి, స్టేట్‌మెంట్ వేసి, రాఘవుడితో బయలు దేరెను- కోణార్క్ చేరేసరికి ప్రొద్దునైంది. ఓ హోటల్‌లో బస ఏర్పాటు చేసేడు రాఘవుడు, రాత్రి కల్లా బేరర్‌ని పిలిచి మందు బాటిళ్లు తెప్పించేసాడు. ఒరేయ్! ఓ పెగ్గు పుచ్చుకుంటావేంటిరా! ఎన్నాళ్ళు మడి గట్టుకుని కూర్చుంటావు, అనుభవించు రాజా' అంటూ బలవంతం చేసేడు. నసేమిరా కాదన్నాను. నొచ్చుకుంటూ ఒరెయ్! జీవితంలో అనుభవించటం నేర్చుకోరా,' అవకాశాల్ని అందిపుచ్చుకున్నవాడే అన్ని మెట్లు ఎక్కి పరమపదసోపాన పటంలో పండిపోతాడబ్బాయ్' అన్నాడు. ఆ మర్రోజు నన్ను భువనేశ్వర్‌లో డ్రాప్‌చేసి వెళ్తు 'సారీరా రాజా' రాత్రి చాలా ఎక్కువయింది. నిన్ను బలవంతం చేశా' ఏం అనుకోకు అంటూ సుతారంగా షేక్‌హ్యాండిచ్చి వెళ్ళిపోయాడు. ఇది జరిగి ఇప్పటికి ఓ పాతికేండ్లు- అప్పటికి ఇద్దరుపిల్లలు ఇంటర్ అయిపోయి, ఇంజనీరింగ్ కౌన్సిలింగ్‌లో విజయవాడ వచ్చినపుడు కాబోలు ఎమ్‌సెట్‌లో రాంక్ వచ్చినా మా పిల్లలకు కావల్సిన కాలేజ్, గ్రూప్ యిప్పించిన ఘనత మా రాఘవుడిదే. అప్పటికి వాడు సెంట్రల్ ఎక్సయిజ్ డిపార్టుమెంట్ జాయిన్ అయాడు. సూపరెంటెంట్ క్యాడర్‌లో వున్నాడు. ఏదైనా అన్ని ఫోన్‌లమీదే పనులు జరిగిపోతున్నాయి. ఏరా రాఘవా అద్భుతంరా

నీ ఇన్ఫ్లుయన్స్ అంటే, నాదేం కాదు మిత్రమా 'అంతా మందు మహిమ' అంటూ ఒక్కనవ్వు నవ్వేడు. ఆ నవ్వులో వాడి జీవిత అనుభవం అంతా మెదిలింది.

రాఘవుడికి పెండ్లి లేటుగానే అయింది. పిల్లలు లేటుగానే పుట్టారు. ఇంటిని ఏ మాత్రం పట్టించుకోకున్నా వాడి శ్రీమతి మాత్రం సంసారాన్ని గుంభనంగానే లాక్కొచ్చేది. 'ఎందుకురా పిల్లల్ని అలా వదిలేశావ్' అని కాస్త స్వతంత్రం తీసుకుని అడిగేవాడ్ని. నవ్వేవాడు. ఒక్కముక్క బదులు వచ్చేది గాదు వాడినోటిగుండా' పుట్టించిందాకే మనం. తర్వాత అంతా వాండ్లిష్టం. రెక్కలు వచ్చిందాకా గూట్లో వున్నా, రాగానే ఎటెగిరి వెళతారో అనేవాడు. వాడనుకున్నట్లుగానే పిల్లలు తలాతోవ బట్టారు పెద్దయింతరువాత. నా పరిస్థితి అంతే అయింది. ఇద్దరు పిల్లలు పెండ్లి అయి, ఉద్యోగాలు వెతుక్కుంటూ, సంపాదన, డాలర్ల మోజులో అమెరికా వెళ్ళిపోయిం తరువాత 'నేను' 'అది' యిక్కడే వంటరిగా మిగిలిపోయాం. జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అనుకొని, అవసరం అయి కూడా!

మనవల్ని, కొడుకు కోడళ్ళతో 'ఇంటర్‌నెట్'లోనే పలకరింపులు ఆపేక్షలు.

వంటరి బతుకులు యిక్కడ, చాకిరి బతుకులు యితర దేశాల్లో. 'కూటికోసం కోటి విద్యలు' అన్నారు కానీ ఆపేక్షలు, అభిమానాలు, తెంచుకోమనలేదు కదా! రోజు సాయంత్రం వాకింగ్‌కి వెళ్ళేప్పుడు టంచనుగా వచ్చేవాడు రాఘవుడు. చెరువు గట్టు మీద రెండు రౌండ్లు వేసి ఎనిమిదయేసరికి యింక వుండే వాడుగాదు. ఎవరో పిలుస్తున్నట్లు హడావుడి పడేవాడు. 'ఒరేయ్ వెళ్తాన్రా పూజకు వేళయిందనేవాడు. రోజు'మందు' పడింది వుండేవాడు కాదు. ఎడిక్టయిపోయాడు. ఎవరు, ఎప్పుడు, ఎందుకిలాగ మారతారో భగవంతునికే తెలియాలి. దీనికి జవాబు లేదనుకుంటాను.

మా ఆవిడకు మాత్రం రాఘవుడంటే అమితమైన ఆపేక్ష. తమ్ముడి కంటే ఎక్కువగా చూసేది. ఇచ్చిన కాఫీ తాగుతూ 'అమ్మా వదినా! మీ ఆయన్ను చెడగొడుతున్నాననుకుంటావేమో! అదేంలేదు. అనేవాడు.

ఆయన సంగతీ నాకు తెలుసన్నయ్యా! ఒకరు చెడగొడితే చెడిపోయేవాండ్లు ఏపాటి' అనేది.

కాఫీ తాగి నేరాసిన గేయాలు, కవితలు వినేవాడు. నా మొదటి పాఠకుడూ వాడే. వాడే పదాలు, తప్పులు దిద్దేవాడు. తెలుగులో మంచి అభినివేశం వున్నవ్యక్తి రాఘవుడు.

ఎప్పుడు అంటుండే వాడు 'నాతో'

ప్రతిది సులభముగా సాధ్యపడదులెమ్ము

నరుడు నరుడౌట ఎంతయు దుష్కరమ్ము సుమ్ము'

అంటూ గాలిబ్‌ని ధాశరథి' ని జ్ఞాపకం చేసుకుంటేవాడు.

పొయెట్రీ ఎలా వుండాలో చెప్పేవాడు. అభ్యుదయ కవిత్వం దగ్గరనుండి విరసం దాకా, అక్కడనుంచి సర్రియలిజం వరకు, చెట్టు ఇస్మాయిల్ గురించి, చలం గురించి, తిలక్ గురించి అమృతం కురిసిన రాత్రిలో సగటు మనిషి గురించి, భిక్షువర్షియసిలో ముసలమ్మ' గురించి ఒక్కటేమిటి వాడి 'యీస్తటిక్' సెన్స్ అలావుండేది. మందుమీద వున్నప్పుడు ఇంకా ఎక్కువయ్యేది. భార్యపోయాక మరీ దిగులు పడిపోయాడు. పిల్లలిద్దరూ ఏదో ప్రైవేటు కంపెనీలో పెద్దవుద్యోగాలు లేకపోయినా, సర్దుకుని కాపురాలు చేస్తుండేవాండ్లు. రాఘవరావు వాండ్లని ఇబ్బంది పెట్టేవాడూ గాదు. పిల్లలు ఆయన్నూ ఏం అనేవారు కాదు. ఎవరి జీవితాలు వారివి అన్నట్లుండేవారు. వాడి రిటాయిర్‌మెంట్ రోజనుకుంటాను. మా బ్యాచ్ బతికి వున్న వాండ్లని చివరగా విడిపోయి అక్కడక్కడా సెటిల్ అయివున్న వాండ్లందరికి ఫోన్లు చేసి ఓ పెద్ద పార్టీ అరేంజ్ చేసేడు. ఆరోజు అందరం బాల్య మిత్రులం కలిశాం. కష్టం, సుఖం కలబోసుకున్నాం. సృష్టిలో తీయనిది స్నేహమేకదా అన్న అనుభూతిని నెమరు వేసుకుంటూ బరువెక్కిన గుండెతో వెళ్ళిపోయాం. మా బాల్యమిత్రులందరిని కలిపిన 'ఘనత' వాడిదే. రాఘవుడు ఏం చేసినా 'మెమరబుల్' గా వుండేదది. ఆ పార్టీలోనే అనుకుంటాను ఇద్దరు మిత్రుల్ని వియ్యంకుల్ని చేసిన పుణ్యం కూడా రాఘవుడే మూట కట్టుకున్నాడు.



'రావి రంగారావు జీవితం-సాహిత్యం' విజ్ఞానసుధ ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న మాజీమంత్రి శ్రీ మండలి బుద్ధప్రసాద్, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, డా॥ద్వా.నా.శాస్త్రి, శ్రీ గుత్తికొండ సుబ్బారావు తదితరులు

* * * * *

రాఘవుడ్ని తలుచుకున్నంతసేపు మనస్సు మెలాంకలి'గా అయిపోతుంది. శ్రీశ్రీ గేయం 'వెళ్ళిపోయావానేస్తం' గుర్తువస్తుంది.

జీవితంలో కష్టపడ్డ వాండ్లు గుర్తుకొస్తారు రాఘవుడ్ని తలుచుకున్నప్పుడు. వారాలు చేసుకుని చదువుకున్న విద్యార్థులు గుర్తుకొస్తారు. జీవితాంతం కష్టాల్లో గడిపిన సగటు మనుషులు గుర్తుకొస్తారు. భాధల్ని మరిచిపోవటానికి తాగుడికి బానిసయిన 'దేవదాసులు గుర్తుకొస్తారు. రాఘవుడు 'దేవదాసు' సినిమా ఎన్నిసార్లు చూశాడో లెక్కలేదు. సెకండుషో సినిమా నించి వస్తూ అనేవాడు. 'రాజా! నే చనిపోతే ఎవరైనా రెండు కన్నీటి బొట్లు రాల్చుతారంటావా' అనేవాడు. నా కండ్లు అప్పటికే కన్నీళ్ళతో నిండికుండేవి. 'ఛ' ఎందుకు అలా అనుకుంటావ్ అనేవాణ్ణి. అయిన వాండ్లంతా చివరి రోజుల్లో వదిలేశారు. భార్యపోయింది. ఒంటరి బ్రతుకు అనుభవించాడు. కొడుకుల మీద ఆధారపడలేదు. ఏదో వెళ్ళి జీవితం గడిపాడు రాఘవుడు. చివర చివర్లలో ఎవ్వరి యిండ్లకు వెళ్ళటం మానేశాడు.

ఎప్పుడన్నా నా దగ్గరికి వచ్చినపుడు మాత్రం సంతోషంగా, వుషారుగా వుండేవాడు. కాస్త పూరట చెందేవాడు. చివరి రోజుల్లో అదీ రావటం మానేశాడు'

ఓ రోజు కాబోలు'ధైర్యం చేసి మా ఆవిడే అంది' రాఘవన్నయ్యా

ఆ పాడు తాగుడు, తాగకపోతే ఏం అన్నయ్యా! వళ్ళు పాడైపోతుంది. మానెయ్యరాదూ! అన్నది. 'ఇదిపుడకతో కానీ పోదమ్మా' అంటూ.

ఆరోజు 'తలకాయ వంచుకొని వెళ్ళిపోయాడు. మళ్ళీ ఇంటికి రాలేదు. ఇపుడీ వార్త ఓ సగటు మనిషి ఈ లోకాన్ని వదలి వెళ్ళిపోయాడు తిరిగి రాని లోకాలకు వెళ్ళిపోయాడు.

అప్రయత్నంగా రెండు కన్నీటి బొట్లు నాకను కొలుకుల నుండి జారి నా వుత్తరీయంపై పడ్డాయి.

# ఆహ్వానం మనీషా సాహితీ అవార్డ్ 2010

మనీష' సాహిత్య,సాంస్కృతిక, సామాజిక సేవాసంస్థ ప్రతి సంవత్సరం ఒక ఉత్తమ వచన కవితా సంపుటికి 'మనీషా సాహితీ అవార్డ్' అందజేస్తుంది. ఎంపికయిన కవితా సంపుటికి 3,000 రూ॥లు నగదు పురస్కారంతో అవార్డ్ అందజేయబడుతుంది. ఈ సంవత్సరం అందజేయబోయే 'మనీషా సాహితీ అవార్డ్' కై స్వీయ వచన కవితా సంపుటిలను ఆహ్వానిస్తున్నారు. 2009సం॥-2010 సం॥ల మధ్య ప్రచురితమైన, సామాజిక అంశాల్ని వస్తువుగా తీసుకున్న వచన కవితా సంపుటులను మాత్రమే 3 ప్రతులను సెప్టెంబరు నెల 30 వతేదీలోగా 'చింతా లక్ష్మీసుజాతారాజ్, అధ్యక్షులు, మనీష సాహిత్య సంస్థ, సెయింట్ మేరీస్ ఒకేషనల్ జూనియర్ కాలేజి, 1-63, యంఆర్ఓ ఆఫీసు దగ్గర మైలవరం (పోస్టు), కృష్ణాజిల్లా 521230 ' చిరునామాకు పంపించవలెను. డిసెంబర్ నెలలో మనీష దశమ వార్షికోత్సవం సందర్భంగా విజేతకు అవార్డు అందజేయబడుతుంది. వివరాలకు చింతా లక్ష్మి సుజాతారాజ్, వ్యవస్థాపక అధ్యక్షులు సెల్ నెం 9848297340 కు ఫోన్ చేయగలరు.

# నేను

## డా॥ అజాద్ సవర

నాకేమయిందిప్పుడు
ఏ దృశ్యం చూసినా
కళ్లంట నీళ్లురావు, శరీరం పులకరించదు
కళ్లు ఎరుపెక్కవు; చెమట పట్టదు;
హృదయస్పందనంతో మార్పేవుండదు.
నాకేమయిందిప్పుడు?
నేనిప్పుడు వృద్ధుడనైపోయాను.
పేదరాసి పెద్దమ్మ
ఆకాశంమీద కుంకం ఎండబోసిందంటే
కళ్లప్పగించి చూసేవాడిని.
సంధ్యారాగాన్ని మనస్సులో నింపుకొని
ఆనందంగా ఎగిరేవాడిని
మామయ్య చంద్రహాసోపాఖ్యానం
చదువుతుంటే విని ఏడ్చేవాడిని,
మళ్లీ మళ్లీ చదివించుకొని
మళ్లీ మళ్లీ ఏడ్చేవాడిని.
ఇజబెల్లా చదువుతూ
కన్నీటితో తలగడతడిపేవాడిని.
మరి నాకేమిందిప్పుడు?
ఔను నేను వృద్ధుడనైపోయాను,
ఈనాడు నాకు ఏ అనుభూతి కలగడం లేదు
ఒక ఆవేశం లేదు, ఆక్రోశంలేదు, ఆక్రందన లేదు
ఆనందంలేదు; విచారం అంతకంటే లేదు.
రంగుల వంతెన
"ద రెయిన్‌బో" నెక్కి
క్రింద ప్రవమిస్తున్న
భూలోకాన్ని చూసి
ఆనందంగా గంతులు వేసిననాకు
ఇప్పుడు హరివిల్లు వర్ణ విశ్లేషణం మాత్రమే.
పక్కింటి వదినగారి నగలమీదే మా ఆవిడ చూపు.
మన దృష్టంతా అలంకారాలమీదే, ఆత్మమీదకాదు.
నడకల రీతులు చూస్తాను
అలంకారాలలో ఇనుమడించిన
అందాలు చూస్తాను.
కాని నిసర్గ రమణీయమైన
నగ్న సౌందరాన్ని దర్శించలేను;
అందుకోలేను.
భవభూతి రసావర్ణంలో
మునిగిపోకుండా
వెలుపలికి వచ్చిన నేను
రసోత్పత్తి గురించి ఆలోచిస్తాను
రసనిష్పత్తి గురించి రాసేస్తాను.
నా నాలుక మొద్దుబారిపోయింది
ఐనా వండినవాడి పేరుచెప్తే
పాకాల పదార్థాలు తెలుసుకొని
పదార్థాల రుచి చెప్పేస్తాను.
పదాల అర్థాలు నాకు బాగా తెలుసు
మీరు ఆస్వాదిస్తారు, అనుభవిస్తారు
నాకా అదృష్టం ఏనాడో పోయింది.
నేను వృద్ధుడనైపోయాను కదా!
నాకీ స్థితప్రజ్ఞత వద్దు
నాకీ పాండితీ పటిమ వద్దు
నాకీ డిగ్రీలు వద్దు.
తల్లి ఒడొలోని కంగారులా
వింత కన్నులతో లోకాన్ని చూసే
అనుభూతి కావాలిప్పుడు నాకు.
సంపూర్ణానుభవంతో
అనుభూతిపూర్ణం అయిపోయిన నేను
దుశ్శాలువలు కప్పుకొన్న
ముదురు వెదురు బొంగును.